




జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు








| బుధవారం 11 మార్చి 2026 | పేజీలు 04 | వెల - 2/- | సంపుటి 01 సంచిక 282 | ప్రచురణ - తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : కాసే అమృత |
|---|---|---|---|---|---|




## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 11 : తాజాగా రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార మరియు పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సేవలో ఆయనకు ఉన్న అనుభవం, నిబద్ధత, అంకితభావం తెలంగాణ గళాన్ని దేశ రాజధానిలో బలంగా వినిపించేందుకు దోహదపడతాయని మంత్రి అభిప్రాయపడ్డారు. రాజ్యసభలో ఆయన పార్లమెంటరీ ప్రస్థానం విజయవంతంగా కొనసాగుతూ ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు.

## శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా





సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 11 : తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్‌గా నియమితులైన శివ ప్రతాప్ శుక్లా మంగళవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, డీజీపీ శివధర్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు గవర్నర్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం అధికారిక కార్యక్రమాల నిమిత్తం గవర్నర్ హైదరాబాద్ నగరానికి బయలుదేరినట్లు అధికారులు తెలిపారు.



## అవయవ మార్పిడి విధానాలపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 11 : రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సచివాలయంలోని తన కార్యాలయంలో ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ చట్టం (థోటా) పాలసీ రూపకల్పన, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం అమలు అంశాలపై ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అవయవ మార్పిడి చికిత్సలపై ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చించిన మంత్రి అవయవ దానాలను ప్రోత్సహించేందుకు విధివిధానాలను సరళీకృతం చేయాలని అధికారులను ఆదేశించారు. అవయవ మార్పిడి చికిత్సలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలో అవయవ దాన చట్టం సమర్థవంతంగా అమలు అయ్యేలా సమగ్ర పాలసీ రూపకల్పనపై అధికారులు, ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చించారు. ఈ సందర్భంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో అవయవ మార్పిడి చికిత్సల అధిక ధరలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేస్తూ సామాన్యులకు కూడా భరించగలిగే విధంగా ధరల నియంత్రణ ఉండాలని సూచించారు. దాతలు ఇచ్చిన అవయవాలు వృథా కాకుండా ఆసుపత్రులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఇతర దేశాల నుంచి అవయవ మార్పిడి కోసం వచ్చే రోగుల కోసం కొత్త విధివిధానాలు రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. ప్రైవేటు ఆసుపత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా మంత్రి అడిగి తెలుసుకుని అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో చేతి మార్పిడి చికిత్స కోసం నాలుగు ఆసుపత్రులకు ఇప్పటికే అనుమతులు ఇచ్చినట్లు వెల్లడించారు. అలాగే రాష్ట్రంలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం అమలుపై ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చిస్తూ అన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్సలకు అయ్యే టారిఫ్‌లపై నియంత్రణ ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తు, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, జీవన్ దాన్ డైరెక్టర్ డాక్టర్ శ్రీ భూషణ్ రాజ్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ మరియు వివిధ ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు, ప్రతినిధులు పాల్గొన్నారు.



## బాసర నుంచి భద్రాచలం వరకు దేవాలయాల అభివృద్ధికి సర్క్యూట్ ప్రణాళిక

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 11 : వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రధాన మరియు పురాతన దేవాలయాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన గోదావరి పుష్కరాల కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేసే విధంగా ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. అవసరమైన చోట రోడ్ల నిర్మాణం, అభివృద్ధికి కావలసిన నిధులపై ఆర్థిక అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొని ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. బాసర, భద్రాచలం, కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయం వంటి ప్రసిద్ధ క్షేత్రాలతో పాటు మధ్యలో ఉన్న ఇతర దేవాలయాలకు కూడా సౌకర్యవంతమైన రోడ్ల కనెక్టివిటీ కల్పించేలా ఈ ప్రణాళిక అమలు చేయాలని అన్నారు. ఇప్పటికే బాసర దేవాలయానికి మాస్టర్ ప్లాన్ ఆమోదం ఉన్న నేపథ్యంలో భద్రాచలం దేవస్థానం మాస్టర్ ప్లాన్‌ను కూడా కమిటీలో చర్చించి ముఖ్యమంత్రి ఆమోదం తీసుకునేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో భారీగా వైద్యుల నియామకం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 11 : రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను బలోపేతం చేయడానికి భారీ సంఖ్యలో వైద్యుల నియామక ప్రక్రియ వేగం పుంజుకుంది. మొత్తం 692 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మెరిట్ జాబితాను విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ఈ నెలాఖరులోపు సుమారు 690 మంది వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధుల్లో చేరే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ నియామకాలతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు మరింత మెరుగుపడతాయని భావిస్తున్నారు.

## గ్రామపంచాయతీలకు శాశ్వత భవనాలు నిర్మించాలి – ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

### అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ఉపాధి కల్పించే కోర్సులు ప్రారంభించాలి





సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 11 : రాబోయే మూడు సంవత్సరాల్లో రాష్ట్రంలో శాశ్వత భవనాలు లేని అన్ని గ్రామపంచాయతీలకు శాశ్వత భవనాలు నిర్మించేందుకు పంచాయతీరాజ్ శాఖ సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు సూచించారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో నిర్వహించిన ప్రీ బడ్జెట్ సమావేశాల్లో మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, గడ్డం వివేక్‌లతో కలిసి ఆయా శాఖల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాలను అవసరమైన చోట కలిపి నిర్మించే అవకాశాలు పరిశీలించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి పౌష్టికాహారంతో పాటు మెరుగైన బోధనా పద్ధతులు అమలు చేయాలని తెలిపారు. రహదారులపై చిన్నారులతో యాచకవృత్తి కొనసాగిస్తున్న వారిని శిశు విహార్‌లలో చేర్చి సంరక్షణ చర్యలు చేపట్టాలని, శిశు విహార్‌లలో ఆధునిక వంటగదులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉపాధి అవకాశాలు పెంపొందించే విధంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో కోర్సులు ప్రవేశపెట్టి గ్లోబల్ సమ్మిట్‌లో ఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు ట్రైబల్ ఏజెన్సీల ద్వారానే జరగాలని, వారికి ఐటీడీఏల నుంచి పూర్తి సహకారం అందించి ఆర్థికంగా బలోపేతం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి కవ్వాల్, శ్రీశైలం వంటి టైగర్ జోన్లలో ఎకో టూరిజం, ఆలయ పర్యాటక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. డ్రగ్స్ మహమ్మారిపై యువతలో అవగాహన పెంచేందుకు గ్రామ స్థాయిలో కళారూపాల ద్వారా ప్రచారం చేయాలని సాంస్కృతిక శాఖను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్, మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, సీసీఎల్ఏ సెక్రటరీ లోకేష్ కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, గృహనిర్మాణ శాఖ కార్యదర్శి గౌతం, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి 99 రోజుల కార్యాచరణపై ప్రజాప్రతినిధులకు శిక్షణ నిర్వహించాలి

## ఈనెల 12న సర్పంచులు, వార్డు సభ్యులు, మేయర్లు, చైర్మన్లకు శిక్షణ






సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 11 : ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యక్రమంపై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు జిల్లా కలెక్టర్లకు ఆదేశించారు. ఈనెల 12వ తేదీన కొత్తగా ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు, చైర్మన్లు, మేయర్లకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమంపై ఆయన మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. జూన్ 12 వరకు అమలు చేసే 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతాయని ముఖ్యమంత్రి పదేపదే చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12,700 గ్రామపంచాయతీలు, 110 మున్సిపల్ సంస్థలు ఉండగా దాదాపు 15 వేల మంది ప్రజాప్రతినిధులు ఉన్నారని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను ఆహ్వానించాలని సూచించారు. జిల్లా స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించే ఫోటో ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఫైళ్ల క్లియరెన్స్, పారిశుధ్య కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు జిల్లా కలెక్టర్లను అభినందించారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్మన్లు, మేయర్లకు ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇవ్వాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, మున్సిపల్ పరిపాలన కార్యదర్శి టి.కె. శ్రీదేవి, సెర్ప్ సీఈఓ దివ్య, ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.



# యువతకు సివిల్ డిఫెన్స్ వాలంటీర్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం అత్యవసర పరిస్థితుల్లో తొలి స్పందనకారులుగా యువతను తీర్చిదిద్దే లక్ష్యం

సందేశం టైమ్స్, సికింద్రాబాద్, మార్చి 11 : తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ విభాగం ఆధ్వర్యంలో యువతను అత్యవసర పరిస్థితుల్లో తొలి స్పందనకారులుగా తీర్చిదిద్దేందుకు "సివిల్ డిఫెన్స్ వాలంటీర్ ట్రైనింగ్" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమం మార్చి 10 నుండి మార్చి 16 వరకు మొత్తం ఏడు రోజుల పాటు నిర్వహించనున్నారు. సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ సెంటినరీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, మాజీ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ అరుణ ఎం. బహుగుణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యవసర సేవలు సంఘటన స్థలానికి చేరుకునేలోపు స్థానిక యువత ముందుగా స్పందించి ప్రజలకు సహాయం చేయడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ శిక్షణలో రక్షణ చర్యలు, అగ్నిమాపక చర్యలు, ఫస్ట్ ఎయిడ్ చికిత్స, గుంపుల నియంత్రణ, సహాయ సామగ్రి పంపిణీ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. యుద్ధ పరిస్థితులు, ఎయిర్ రైడ్స్, రసాయన లేదా అణు దాడులు వంటి విపత్తుల సమయంలో ఈ వాలంటీర్లు వివిధ ప్రభుత్వ శాఖలకు సహాయపడతారని తెలిపారు. పోలీసులు, ఫైర్ సర్వీసులు, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం మరియు ఇతర శాఖలతో సమన్వయంగా ఈ వాలంటీర్లు పనిచేస్తారని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ విభాగం డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ అధికారులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వాలంటీర్ల సహాయం ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఫ్ఓ బి. సుధాకర్ రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ మరియప్పన్, అకాడమిక్స్ డీన్ డా. కళ్యాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ రహీమ్, డీఎఫ్ఓ దాస్ తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాద్‌లో జరగనున్న 13వ ఆసియన్ టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్ బ్రోచర్ విడుదల

## టెక్స్‌టైల్ రంగంలో తెలంగాణను అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 11 : హైదరాబాద్‌లో నిర్వహించనున్న 13వ ఆసియన్ టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్ (ఏటెక్స్‌కాన్–2026) కు సంబంధించిన "రీ–ఇమ్యాజినింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ గ్లోబల్ టెక్స్‌టైల్స్" బ్రోచర్‌ను రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు మరియు దుద్దిళ్ల శ్రీధర్ బాబు సంయుక్తంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ తెలంగాణను దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో టెక్స్‌టైల్ రంగంలో ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. హైదరాబాద్‌లో జరిగే ఏటెక్స్‌కాన్–2026 ద్వారా దేశీయ, అంతర్జాతీయ టెక్స్‌టైల్ పరిశ్రమల ప్రతినిధులు, పెట్టుబడిదారులు, నిపుణులు ఒకే వేదికపైకి రావడం వల్ల తెలంగాణలో టెక్స్‌టైల్ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ సమావేశాన్ని తెలంగాణ ప్రభుత్వం కన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ భాగస్వామ్యంతో 2026 ఏప్రిల్ 2 మరియు 3 తేదీల్లో హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నారు. సమావేశంలో టెక్స్‌టైల్ రంగంలో స్థిరత్వం, సాంకేతికత, సరఫరా వ్యవస్థల అభివృద్ధి, గ్లోబల్ మార్కెట్ల అవకాశాలు వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి. అదనంగా ఏప్రిల్ 4న వరంగల్‌లోని పీఎం మిత్రా పార్క్‌కు పరిశ్రమల సందర్శన కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశం ద్వారా తెలంగాణను టెక్స్‌టైల్, అపారెల్ మరియు ఫుట్‌వేర్ తయారీకి అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా నిలబెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రులు వెల్లడించారు.

# ఈ నెల 22న నర్మెట్ట ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం 20 నుంచి 22 వరకు రైతు మేళా నిర్వహణ – ఏర్పాట్లపై మంత్రి తుమ్మల సమీక్ష

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 11 : రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు అభివృద్ధి దిశగా మరో కీలక అడుగు పడుతోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత మరియు వస్త్ర శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో నిర్మించిన ఆధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఈ నెల 22వ తేదీన ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో రెండు ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ మిల్లులు పనిచేస్తున్నాయని, వాటి సమిష్టి సామర్థ్యం గంటకు 120 మెట్రిక్ టన్నులుగా ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఆయిల్ ఫెడ్ సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో సుమారు రూ.300 కోట్ల అంచనా వ్యయంతో ఆధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని నిర్మించినట్లు చెప్పారు. ప్రారంభ దశలో ఈ యూనిట్ గంటకు 30 టన్నుల సామర్థ్యంతో పనిచేయనుండగా భవిష్యత్తులో గంటకు 120 టన్నుల వరకు విస్తరించేలా రూపకల్పన చేసినట్లు వివరించారు. ఈ యూనిట్ ప్రారంభంతో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు ప్రాసెసింగ్, నిల్వ, మార్కెటింగ్ సౌకర్యాలు మరింత సులభంగా అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. రైతులు తమ పంటలను నేరుగా ఈ యూనిట్‌కు తీసుకువచ్చి ప్రాసెస్ చేయించుకునే అవకాశం ఉండడంతో పాటు ఆధునిక సాంకేతికతతో నూనె తయారీ జరగడం వల్ల నాణ్యత పెరిగి రైతులకు మెరుగైన ధరలు లభించే అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 22 వరకు మూడు రోజుల పాటు రైతు మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేళాలో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన యంత్రాలు, ఆయిల్ పామ్ సాగు విధానాలు, ఉత్పత్తి పెంపు మార్గాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమాల నిర్వహణపై వ్యవసాయ మరియు అనుబంధ శాఖ అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష సమావేశం నిర్వహించి ప్రారంభోత్సవం విజయవంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.

# పర్యాటక అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి పర్యాటక ప్రాంతాలకు విస్తృత ప్రచారం – శాఖ బస్సులను నిరుపయోగంగా ఉంచరాదు : మంత్రి జూపల్లి



సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 11 : తెలంగాణ పర్యాటక రంగాన్ని దేశంలోనే మేటిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మంగళవారం హిమాయత్ నగర్‌లోని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ కార్యాలయంలో సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరి తదితర ఉన్నతాధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, పర్యాటక ఆస్తుల వినియోగం, ప్రచారం, ఆదాయ మార్గాలు, హరిత హోటళ్ల నిర్వహణ, పెండింగ్ పనులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రధాన పర్యాటక ప్రాంతాలకు వెళ్లే దారుల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేసి పర్యాటకులకు సులభంగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలని, ఆయా ప్రాంతాల చరిత్ర మరియు ప్రాధాన్యతను బోర్డులపై సంక్షిప్తంగా వివరించాలని సూచించారు. రాష్ట్రంలో పర్యాటకుల సంఖ్య పెరిగేలా సౌకర్యాలు కల్పిస్తూ తెలంగాణను ఆకర్షణీయమైన పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని చెప్పారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ కళాకారులను ప్రోత్సహించేందుకు పర్యాటక కేంద్రాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రసిద్ధ ప్రాంతాల్లో హంపి థియేటర్లు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బస్సుల వినియోగంపై మంత్రి ఆరా తీశారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన బస్సులను నిరుపయోగంగా ఉంచరాదని, ప్రత్యేక ప్యాకేజీలు మరియు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఆదాయాన్ని పెంచాలని అధికారులకు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా చేపట్టిన సుమారు 84 అభివృద్ధి పనుల పురోగతిని ప్రాజెక్టుల వారీగా సమీక్షించి పరిపాలనా అనుమతులు వచ్చిన వెంటనే టెండర్లు పూర్తి చేసి పనులను వేగవంతం చేయాలని సూచించారు. పనుల పురోగతిపై ప్రధాన కార్యాలయం నుంచి రోజువారీ నివేదిక తీసుకోవాలని, నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. అలాగే వినియోగంలో లేని పర్యాటక స్థలాలను అభివృద్ధి చేసి హోటళ్లు, వెల్నెస్ సెంటర్లు, అమ్యూజ్‌మెంట్ పార్కులు వంటి ఏర్పాట్ల ద్వారా ఆదాయ వనరులను పెంచే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు మంత్రి ఆదేశించారు.

# పట్టణ ప్రాంతాల్లో 18,213 ఇండ్ల నిర్మాణానికి కేంద్రం ఆమోదం పీఎంఏవై (పట్టణ) 2.0 కింద రూ.273 కోట్లు మంజూరు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 11 : రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పట్టణ) 2.0 పథకం కింద గృహ నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలోని 118 పట్టణ ప్రాంతాల్లో మొత్తం 18,213 ఇండ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి. గౌతం తెలిపారు. ఒక్కో ఇంటికి రూ.5 లక్షల వ్యయంతో ఈ ఇండ్లను నిర్మించనున్నారు. ఢిల్లీలో నిర్వహించిన పీఎంఏవై (పట్టణ) 2.0 సెంట్రల్ శాంక్షనింగ్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు ఆమోదం లభించినట్లు వెల్లడించారు. మొత్తం రూ.910.65 కోట్ల అంచనా వ్యయంతో ఈ గృహ నిర్మాణాలు చేపట్టనుండగా, ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ.273.20 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.637.45 కోట్లు వినియోగించనున్నారు. కేంద్ర ప్రభుత్వం తన వాటా నిధులను విడుదల చేయడానికి అంగీకరించిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన పేదలకు పక్కా ఇళ్ల వసతి కల్పించే దిశగా ఈ నిర్ణయం కీలకమని, పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం కావడానికి ఇది దోహదపడుతుందని వి.పి. గౌతం పేర్కొన్నారు.



# వరంగల్ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చర్యలు త్వరలో ఎంజిఎం ఆసుపత్రి ప్రారంభం – భూగర్భ డ్రైనేజీ పనులకు త్వరలో శ్రీకారం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 11 : వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార మరియు పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం సచివాలయంలో తన కార్యాలయంలో దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి వరంగల్ నగరాభివృద్ధిపై జిల్లా ప్రజాప్రతినిధులు మరియు అధికారులతో సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి ధీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి పరచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అభివృద్ధి పనుల అమలులో వేగం పెంచి ప్రజల అవసరాలకు అనుగుణంగా కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జూన్ 2 నాటికి ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భద్రకాళి ఆలయ అభివృద్ధి పనులు, భద్రకాళి చెరువు డీ సిల్టేషన్, ఆలయ మాడవీధులలో కృష్ణశిలతో నిర్మాణం చేపట్టడం, చెరువు హెడ్ రెగ్యులేటర్ వద్ద ఇన్ ఫాల్ అవుట్ ఫాల్ పనులకు భూ సేకరణ వేగవంతం చేయాలని సూచించారు. గత ప్రభుత్వంలో ప్రారంభించి నిలిచిపోయిన వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను పూర్తి చేసి జూన్ నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, ఆసుపత్రికి అవసరమైన పరికరాలు, వైద్య సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఇన్నర్ రింగ్ రోడ్, అవుటర్ రింగ్ రోడ్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భూసేకరణ వేగవంతం చేయాలని తెలిపారు. వరంగల్ పట్టణంలో రూ.5,257 కోట్లతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ పనులకు టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి వచ్చే నెలలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న రెండు పడకగదుల ఇండ్లకు ఈ నెల 31లోగా లబ్ధిదారులను ఎంపిక చేసి కేటాయించాలని, ఆ కాలనీల్లో కరెంట్, డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో శాసనసభ్యులు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాగరాజు, నాయిని రాజేందర్, శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, వరంగల్ మరియు హన్మకొండ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



## నూతనంగా ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు మరియు నూతనంగా ఎన్నుకోబడిన రాష్ట్ర, జిల్లా సంఘ నాయకులకు ఘన సన్మానం

జహీరాబాద్ మర్చి 11( సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్) తెలంగాణ ఎరుకల రాష్ట్ర సంఘం ఆదేశాల అనుసారం సంగారెడ్డి జిల్లా ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ఇటీవల జిల్లాలో నూతనంగా ఎన్నుకోబడిన ఎరుకల కౌన్సిలర్లకు, సర్పంచులకు, వార్డ్ మెంబర్లకు సంగారెడ్డి జిల్లా బైపాస్ లో ఉన్న ఆయోగ భవనంలో జిల్లా సమావేశం ఏర్పాటు చేసి, ఎరుకల ప్రజా ప్రతినిధులైన కౌన్సిలర్ కిషన్ అన్నారం, కౌన్సిలర్ నర్సింలు సదాశివపేట్, కౌన్సిలర్ శ్రీకాంత్ కోహీర్ , మరియు సర్పంచ్ , వార్డ్ మెంబర్లకు సంఘ సభ్యులు ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమం అనంతరం తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుతాడి రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండ్లాపురం గోపాల్, రాష్ట్ర సలహాదారులు కెంపుల రాజు ఆధ్వర్యంలో నిమ్మల కిష్టయ్య గారిని తెలంగాణ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మరియు జిల్లా ఇన్చార్జిగా ఎన్నుకొని ప్రశంస పత్రం అందజేయడం జరిగింది.అదేవిధంగా రాష్ట్ర కార్యదర్శిగా కెంపుల తుల్జారాం గారిని , జిల్లా ఉపాధ్యక్షులుగా రాములు గారిని, జిల్లా ఎరుకల యూత్ ప్రధాన కార్యదర్శిగా జగన్ గారిని ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సారోళ్ల యాదయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సార్ల రాజ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ, విట్టల్, రాములు ,జిల్లా కోశాధికారి మహేష్, రాష్ట్ర ఎరుకల యూత్ అధ్యక్షులు కుతాడి విశ్వనాథ్,జిల్లా ఎరుకల యూత్ అధ్యక్షులు సంతోష్ ,కుల పెద్దలు రిటైర్డ్ ఎస్సై అంజన్న, పోషన్న , మానయ్య, ప్రవీణ్ , బక్కన్న, శివన్న, నరేందర్,ఎరుకల కులస్తులు, యువకులు, బంధుమిత్రులు పాల్గొని, నూతనంగా ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులకు, నూతనంగా ఎన్నుకోబడిన రాష్ట్ర, జిల్లా నాయకులకు ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## తారా ప్రభుత్వ కళాశాలలో 'స్మార్ట్ రీసెర్చ్ వర్క్‌షాప్




సంగారెడ్డి, మార్చి 11 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్) సంగారెడ్డి జిల్లా లో విద్యార్థుల్లో పరిశోధనాత్మక ఆలోచనలను పెంపొందించి ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకునే దిశగా తారా ప్రభుత్వ కళాశాలలో 'స్మార్ట్ రీసెర్చ్ వర్క్‌షాప్' నిర్వహించారు.మంగళవారం వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో విద్యార్థులకు పరిశోధన ప్రాముఖ్యత, కృత్రిమ మేధస్సు (AI) వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ప్రభు సహాయ మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు సాయంతో అనేక పనులను త్వరగా, ఖచ్చితంగా పూర్తి చేయవచ్చని తెలిపారు. ఆధునిక సాంకేతికతను సమర్థంగా వినియోగించడం ద్వారా విద్యార్థులు తమ పరిశోధన సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.ప్రధాన వక్తగా పాల్గొన్న డా. గజేంద్ర బాబు మాట్లాడుతూ, పరిశోధన స్ఫూర్తి ఉన్నప్పుడే విద్యార్థుల ఆలోచనా పరిధి విస్తృతమవుతుందని పేర్కొన్నారు. పరిశోధన ద్వారా కొత్త ఆవిష్కరణలు సాధ్యమవుతాయని, విద్యార్థులు కొత్త విషయాలను తెలుసుకునే తపన కలిగి ఉండాలని సూచించారు.కార్యక్రమ సమన్వయకర్త వీరేందర్ మాట్లాడుతూ, పరిశోధన రంగంలో ముందుకు సాగితేనే దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని తెలిపారు. సహ సమన్వయకర్త డా. రవీందర్ మాట్లాడుతూ, జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవడంలో ప్రతి రంగంలో పరిశోధన కీలకమని వివరించారు.వాణిజ్య విభాగాధిపతి జ్యోతి మాట్లాడుతూ, ఈ తరహా కార్యశాలలు విద్యార్థుల్లో పరిశోధనపై ఆసక్తి, జిజ్ఞాసను పెంపొందిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపన్యాసకులు శ్యాం ప్రసాద్, సవన్య, కృష్ణ, శ్రీనివాస్, సాయి వాణి, నందిని, ప్రవళిక, పావని తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి : జిల్లా కలెక్టర్ ప్రావీణ్య






సంగారెడ్డి, మార్చి 11 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్ ) సంగారెడ్డి జిల్లా లో మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే ఏ లక్ష్యాన్నైనా సాధించగలరని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పేర్కొన్నారు.మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళా, శిశు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, టి.జి.ఐ.ఐ.సి చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించగలరన్నారు. ఒకప్పుడు కంటే ప్రస్తుతం పబ్లిక్ సర్వీసుల్లో మహిళా ఉద్యోగులు, ప్రజాసేవలో మహిళా ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తున్నారని తెలిపారు.అన్ని రంగాల్లో మహిళలు తమ ప్రతిభను చాటుకుంటూ సమాజ అభివృద్ధికి తోడ్పడుతున్నారని పేర్కొన్నారు. మహిళలకు దూరదృష్టి ఎక్కువగా ఉంటుందని, పనులను క్రమబద్ధంగా నిర్వహించే సామర్థ్యం ఎక్కువగా ఉంటుందని అన్నారు. మహిళలకు ప్రోత్సాహం కల్పించి వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తే అన్ని రంగాల్లో ఉన్నతంగా రాణించగలరన్నారు.ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అన్ని కార్యక్రమాల్లో మహిళలను భాగస్వామ్యులను చేస్తున్నామని, స్వయం సహాయక సంఘాల మహిళలందరికీ పూర్తి ఆరోగ్య ప్రొఫైల్ రూపొందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు.కుటుంబ సభ్యుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపే మహిళలు తమ ఆరోగ్యం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మహిళల ఉన్నతి సమాజాభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు.టి.జి.ఐ.ఐ.సి చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మహిళలు, పురుషులు సమానులని పేర్కొన్నారు. పిల్లలకు మొదటి గురువు తల్లేనని, ఆడ మగ తేడా లేకుండా పిల్లలను క్రమశిక్షణతో పెంచి మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిపైనే ఉంటుందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు మహిళల పేరిట అందుతున్నాయని, మహిళలు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి సౌజన్య మాట్లాడుతూ మహిళలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా మహిళల రక్షణకు సంబంధించిన పలు చట్టాలపై అవగాహన కల్పించారు.అనంతరం వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన మహిళా ఉద్యోగులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు న్యూట్రిషన్ కిట్స్ పంపిణీ చేశారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్ కుమార్, డిడబ్ల్యూఓ లలిత కుమారి, డిఆర్డీవో జ్యోతి, జిల్లా అధికారులు, డిఎంఅండ్‌హెచ్‌ఓ, సీడీపీవోలు, వివిధ శాఖల మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.అంతకుముందు పలువురు వక్తలు మహిళా దినోత్సవం ప్రాముఖ్యతపై ప్రసంగించగా, బాలసదనం విద్యార్థులు, అంగన్వాడీ టీచర్లు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆకట్టుకున్నారు.




## మహిళలు పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి

సంగారెడ్డి, మార్చి 11 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్ ) సంగారెడ్డి జిల్లా లో సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే మహిళలు ప్రతి రంగంలో అద్భుతాలు సృష్టించగలరని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి అన్నారు.తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల యూనియన్ (టీఎన్జీవోస్) ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిర్మల జయప్రకాశ్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని ముందుకు సాగాలని సూచించారు. ఏ రంగంలో ఉన్నా మహిళలు తమ బాధ్యతలను మరువకుండా అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఎదగాలని అన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. మహిళల కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడం, క్యాంటీన్ల నిర్వహణ, యూనిఫామ్‌లు కుట్టే బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించడం వంటి పలు చర్యలను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. మహిళలు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా, సామాజికంగా మరింత ముందుకు సాగాలని సూచించారు.అదనపు కలెక్టర్ మాధురి మాట్లాడుతూ మహిళలు సహనం, పట్టుదలకు ప్రతిరూపాలని పేర్కొన్నారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో ధైర్యంగా ముందుకు సాగుతూ తమ ప్రతిభను చాటుకుంటున్నారని తెలిపారు. కుటుంబ బాధ్యతలతో పాటు ఉద్యోగ విధులను సమన్వయం చేసుకుంటూ ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మహిళా ఉద్యోగులకు సూచించారు.మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగుల కోసం నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో విజేతలకు ఈ సందర్భంగా బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి విజయలక్ష్మి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు జావిద్ అలీ, కార్యదర్శి రవి, కోశాధికారి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, శ్రీకాంత్, రాష్ట్ర మహిళా కార్యదర్శి నిర్మలా రాజకుమారి, హెచ్‌డబ్ల్యూఓ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్, పంచాయతీ కార్యదర్శుల రాష్ట్ర అధ్యక్షుడు బలరాం, సుధామణి, లక్ష్మి, సుధారాణి, వెంకటేశం, యాదవ్ రెడ్డి, షరీఫ్, జగన్, వివిధ శాఖల మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



## పీఎం సేతు ప్రాజెక్టుతో ఐటీఐల బలోపేతం – యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి, మార్చి 11 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్) సంగారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న పీఎం సేతు ప్రాజెక్టు ద్వారా ఐటీఐ కేంద్రాలను బలోపేతం చేసి ఆధునిక మౌలిక వసతులు కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు.మంగళవారం కలెక్టరేట్‌లో ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పీఎం సేతు ప్రాజెక్టు కింద జిల్లాలోని ఐదు ఐటీఐలను హబ్ అండ్ స్పోక్స్ విధానంలో అభివృద్ధి చేసి పరిశ్రమల సహకారంతో ఐదేళ్లపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఐటీఐల్లో ఆధునిక యంత్రాలు, అవసరమైన మౌలిక వసతులు, శిక్షణా సామగ్రి ఏర్పాటు చేసి వాటిని ఆధునిక నైపుణ్య శిక్షణ కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నట్లు కలెక్టర్ వివరించారు. కాలానికి అనుగుణంగా కొత్త కోర్సులను ప్రవేశపెట్టి యువతకు నైపుణ్య శిక్షణ అందించి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సమావేశంలో ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్. రాజా, ఐటీఐ ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి, సీఎం సేతు కన్సల్టెంట్ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి నియోజకవర్గంలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు చర్యలు తీసుకోండి : జిల్లా కలెక్టర్ ప్రావీణ్య




సంగారెడ్డి, మార్చి 11 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్) సంగారెడ్డి నియోజకవర్గంలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులకు సూచించారు.మంగళవారం కలెక్టరేట్‌లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డితో కలిసి నియోజకవర్గంలోని విద్యా రంగ అభివృద్ధిపై సంక్షేమ శాఖ అధికారులు,టీజీ ఈడబ్ల్యూఐడీసీ ఇంజినీరింగ్ అధికారులు, ప్రిన్సిపాల్స్, ఆర్‌సీవోలు పాల్గొన్న సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంగారెడ్డి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, మహిళా డిగ్రీ కళాశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల్లో కొత్త తరగతి గదులు, భవనాలు, కాంపౌండ్ వాల్స్, మరుగుదొడ్లు, ఆర్.ఓ త్రాగునీటి ప్లాంట్లు, ఫర్నిచర్ వంటి మౌలిక సదుపాయాల కోసం సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.వచ్చే నెల 10వ తేదీలోపు సంబంధిత శాఖలు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. పరిశ్రమల సహకారం, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులతో ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అద్దె భవనాల్లో నడుస్తున్న వసతి గృహాలను సొంత భవనాల్లోకి మార్చేందుకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.జిల్లాలోని మహిళా డిగ్రీ కళాశాలల్లో విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, పాఠశాలలు, కళాశాలల్లో తగిన భద్రతా చర్యలు, మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. ప్రైవేట్ భవనాల్లో నడుస్తున్న కళాశాలలు, వసతి గృహాల వివరాలను సేకరించి నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి నియోజకవర్గంలో విద్యా అభివృద్ధికి పరిశ్రమల సహకారం ఎంతో అవసరమన్నారు. పరిశ్రమల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను వినియోగించి కొత్త హాస్టల్ భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, మహిళా డిగ్రీ కళాశాలలకు అనుబంధంగా సురక్షితమైన వసతి గృహాలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించవచ్చన్నారు.జిల్లాలో విద్యనభ్యసించేందుకు ఇతర ప్రాంతాల నుండి కూడా అనేక మంది విద్యార్థులు సంగారెడ్డికి వస్తున్నారని, అందువల్ల విద్యాసంస్థల వద్ద తగిన మౌలిక వసతులు, వసతి సదుపాయాలు కల్పించడం అత్యవసరమని పేర్కొన్నారు. పరిశ్రమలు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తే విద్యా రంగంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.ఈ సమావేశంలో సీపీఓ బాలశౌరి, సోషల్ వెల్ఫేర్ అధికారి అఖిలేష్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి జగదీష్, పంచాయతీరాజ్ ఎస్ఈ జగదీష్, ఈడబ్ల్యూఐడీసీ అధికారులు రాజు, శ్రీనివాస్ రెడ్డి, సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్ కుమార్, సంగారెడ్డి మాజీ శాసనసభ్యులు జయప్రకాశ్ రెడ్డి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నేతాజీ నగర్ ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్



పటాన్చెరు /మార్చ్11( సంగారెడ్డి టౌన్ ప్రతినిధి: సంగమేశ్వర్)పవిత్ర రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు ఐక్యతకు ప్రతీకలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని బండల్‌గూడ నేతాజీనగర్ ఖాజా గారిబే నవాజ్ మసీద్ నందు మంగళవారం సాయంత్రం మాజీ ఎంపీపీ నాలకంటి యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈనెల 13వ తేదీన పటాన్చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి ఇఫ్తార్ విందును విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, నాగ మల్లేష్ యాదవ్, చంద్రశేఖర్, జబ్బర్, షాబుద్దీన్ , అక్రమ్, యాసిన్, సోహియల్, గోరి, పద్మ, మేరీ, తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో అండగా గ్రామపంచాయతీ సిబ్బంది



వట్పల్లి మార్చి 11 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్వ) వట్పల్లి మండలం గొర్రెకల్ గ్రామపంచాయతీకి చెందిన ఐదుగురు సిబ్బంది పెద్ద మనసు చూపించి జైపాల్‌కు ఆర్థిక సహాయం అందజేశారు. తమ తరఫున తగినంతగా తోచిన సహాయాన్ని బహుమతిగా ప్రకటించి అందించారు.ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వ్యక్తికి సహాయం చేయడం గొప్ప మానవత్వమని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది చూపిన సహృదయతకు అభినందనలు తెలియజేశారు.జైపాల్‌కు అందించిన ఈ సహాయం ఆయనకు ఉపయుక్తంగా ఉండాలని, భగవంతుడు వారికి మంచి చేయాలని గ్రామస్థులు ప్రార్థించారు.

# ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం కీలకం

## జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య





సంగారెడ్డి, మార్చి 11( సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టి సంగమేశ్వర్) సంగారెడ్డి జిల్లాలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99 రోజులపాటు విజయవంతంగా అమలు చేయడంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పేర్కొన్నారు.ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 12వ తేదీన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమంపై మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్‌లకు ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమం ద్వారా పాలనపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించబడుతుందని తెలిపారు.శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లాల కలెక్టర్ల కు సూచించారు.ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణకు ఇప్పటికే షెడ్యూల్ ఖరారు చేయబడిందని, దాని ప్రకారం జూన్ 12వ తేదీ వరకు చేపట్టనున్న కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడానికి అన్ని జిల్లాల అధికార యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని సిఎస్ తెలిపారు.ప్రజాప్రతినిధులు మరియు ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పని చేస్తే ప్రజలకు మెరుగైన ఫలితాలు అందుతాయని ఆయన స్పష్టం చేశారు.శిక్షణ కార్యక్రమంలో భాగంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక, ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ పథకాలు, అలాగే సర్పంచులకు 2018 పంచాయతీ రాజ్ చట్టంపై , మున్సిపల్ కౌన్సిలర్లు మరియు చైర్మన్‌లకు 2019 మున్సిపల్ చట్టం పై, అదే విధంగా వారి విధులు, బాధ్యతలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, ఈ నెల 12వ తేదీన ప్రజాప్రతినిధులకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమానికి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సిఎస్‌కు వివరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుండి అడిషనల్ కలెక్టర్ పాండు, జడ్పీ సీఈవో జానకి రెడ్డి, సిపిఓ బాలశౌరి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా నడుస్తున్న కల్లు దుకాణంపై చర్యలు తీసుకోవాలి : ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతి



సంగారెడ్డి, మార్చి 11(సందేశం టైమ్స్ అందోల్ నియోజకవర్గ ఇన్చార్జి కే మల్లేశం గౌడ్,)కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘానికి విరుద్ధంగా అక్రమంగా కల్లు దుకాణం నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బోరపట్ల గ్రామానికి చెందిన కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘ సభ్యులు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావును కలిసి వినతిపత్రం సమర్పించారు.సోమవారం సంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను కలిసి సంఘ సభ్యులు తమ సమస్యలను వివరించారు. గ్రామానికి చెందిన అంజా గౌడ్, ప్రవీణ్ గౌడ్‌లు గత ఐదారు నెలలుగా సొసైటీకి విరుద్ధంగా అక్రమంగా కల్లు దుకాణం నిర్వహిస్తూ సంఘ సభ్యులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని తెలిపారు.ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు అందడంతో కేసులు నమోదు చేసి, ఎక్సైజ్ అధికారులు దుకాణాన్ని సీజ్ చేసి నడపవద్దని హెచ్చరించినప్పటికీ వారు అధికారుల సూచనలను పట్టించుకోకుండా సీల్ తొలగించి మళ్లీ అక్రమంగా కల్లు దుకాణం నడుపుతున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకొని అక్రమంగా నడుస్తున్న కల్లు దుకాణాన్ని వెంటనే మూసివేయాలని కోరారు.అదేవిధంగా గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు స్వార్థ ప్రయోజనాల కోసం గౌడ కులస్తుల ఉపాధిని దెబ్బతీసే విధంగా సొసైటీపై తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని, అలాంటి ఫిర్యాదులను పట్టించుకోకూడదని జిల్లా అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్, జిల్లా కమిటీ సభ్యుడు రామా గౌడ్, కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు సత్య గౌడ్, చెన్న గౌడ్, అంజా గౌడ్, నరసింహ గౌడ్, మల్లేశం గౌడ్, సత్యనారాయణ గౌడ్, నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏడుపాయల దుర్గాభవాని అమ్మవారిని దర్శించిన కౌన్సిలర్ మన్నే లక్ష్మీ



పటాన్‌చెరు, మార్చి 11 (సందేశం టైమ్స్ పటాన్చెరు మండల్ రిపోర్టర్ బి డేవిడ్) పటాన్‌చెరు మండలం ఇంద్రేశం మున్సిపాలిటీ కౌన్సిలర్ మన్నే లక్ష్మి పాపన్నపేట మండలంలోని ప్రసిద్ధ ఏడుపాయల దుర్గాభవాని మాత ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.మంగళవారం ఆలయానికి చేరుకున్న కౌన్సిలర్ మన్నే లక్ష్మి అమ్మవారికి మొక్కులు సమర్పించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, తమ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆలయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కౌన్సిలర్‌కు ఆలయ విశిష్టతను వివరించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌తో పాటు వార్డు కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ





సంగారెడ్డి, మార్చి 11 ( సందేశం టైమ్స్ సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి కె. సంగమేశ్వర్) రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సచివాలయంలోని తన కార్యాలయంలో ట్రాన్స్ ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ ఆక్ట్ (THOTA) పాలసీ రూపకల్పనపై, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలుపై ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షలో అవయవ మార్పిడి చికిత్స లపై ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చించారు. అవయవ దానాలను ప్రోత్సహించేందుకు విధివిధానాలను సరళీకృతం చేయాలని మంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. అవయవ మార్పిడి చికిత్సలో తెలంగాణ రాష్ట్రం దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా కార్యాచరణను రూపొందించాలన్నారు , రాష్ట్రంలో ఆర్గాన్ డొనేషన్స్ యాక్ట్ సమర్థవంతంగా అమలు అయ్యేలా అవసరమైన సమగ్ర పాలసీ రూపకల్పనపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు , ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో చర్చించారు. ప్రైవేటు ఆసుపత్రులలో అవయవ మార్పిడి చికిత్స ల ధరల పై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్యులకు సైతం అవయవ మార్పిడి చికిత్సలకు అయ్యే ఖర్చును భరించే విధంగా ధరల నియంత్రణ ఉండాలని మంత్రి ప్రైవేట్ యాజమాన్యాల కు సూచించారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు చేసిన సూచనలకు ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు సానుకూలంగా స్పందించాయి. దాతలు ఇచ్చిన అవయవాలు వృధా కాకుండా ఆస్పత్రులు ప్రత్యేక చర్యలను చేపట్టాలన్నారు.ఇతర దేశాల నుండి ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంటేషన్ కోసం వచ్చే రోగుల కోసం నూతన విధివిధానాలను రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు, ప్రైవేటు ఆసుపత్రుల ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం - వైద్య ఆరోగ్యశాఖ అవయవ మార్పిడి చికిత్సలకు అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. రాష్ట్రంలో చెయ్యి మార్పిడి చికిత్స కోసం 4 ఆసుపత్రులు అనుమతులు ఇచ్చామన్నారు.అలాగే, రాష్ట్రంలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలుపై మంత్రి ప్రవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో చర్చించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు అయ్యేలా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా మంత్రి అధికారుల ఆదేశించారు.ప్రైవేటు ఆసుపత్రులలో సామాన్యులకు వైద్య ఖర్చులు భారం కాకుండా ఉండాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో అన్ని ప్రవేట్ ఆసుపత్రులలో చికిత్స లకు అయ్యే టారిఫ్ పై నియంత్రణ ఉండేలా కార్యాచరణ కు శ్రీకారం చుట్టామన్నారు,ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ డా. క్రిస్టినా జెడ్ చొంగ్తు, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డా. నరేంద్ర కుమార్, జీవన్ దాన్ డైరెక్టర్ డా. శ్రీ భూషణ్ రాజ్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే వర్ధంతి ఘన నివాళులు అర్పించిన ఆత్మ కమిటీ చైర్మన్ కాచూర్ రావు




వట్పల్లి మార్చి 11 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్) ప్రముఖ సంఘ సేవకురాలు, దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆత్మ కమిటీ చైర్మన్ కాచూర్ రావు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల విద్యాభివృద్ధికి సావిత్రిబాయి పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలో మహిళలకు విద్య హక్కు కల్పించేందుకు ఆమె ఎన్నో కష్టాలు ఎదుర్కొంటూ పోరాడిన మహనీయురాలని కొనియాడారు. “సావిత్రిబాయి పూలే భారతదేశంలో మహిళా విద్యకు నాంది పలికిన గొప్ప సంస్కర్త. సామాజిక అడ్డంకులు, వివక్షను ధైర్యంగా ఎదుర్కొంటూ బాలికల కోసం తొలి పాఠశాలను ప్రారంభించి మహిళా సాధికారతకు మార్గదర్శకురాలిగా నిలిచారు. ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలి” అని కాచూర్ రావు పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే చూపిన మార్గంలో నడుస్తూ మహిళల విద్య, సమాన హక్కుల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# పటాన్చెరులో మహిళా క్రీడోత్సవాలు, రైతుల హక్కుల కోసం హెచ్చరికలు



పటాన్చెరు, మార్చి 11 (సందేశం టైమ్స్ బి. డేవిడ్) – పటాన్చెరు మండల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా క్రీడోత్సవాలు మంగళవారం పటాన్చెరు మైత్రి మైదానంలో ఉదయం 8 గంటలకు లాంచన్గా ప్రారంభించబడ్డాయి. పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, మహిళలు ప్రతి రంగంలో రాణించాలి, పురుషులతో పోటీపడుతూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆయన చెప్పారు, మార్చ్ 12న డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కాన్వెన్షన్ సెంటర్లో వేలాది మహిళలతో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు. క్రీడల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

అలాగే, పటాన్చెరువు మండల్‌లోని అన్నారం గ్రామ పరిధిలో ఆరుగాలం పంటలు పండిస్తున్న రైతుల భూహక్కుల పరిరక్షణ కోసం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. TGIIC సంస్థలు భూములను రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా వ్యవహరిస్తూ కూరగాయలుగా అమ్మకాలు చేపడుతున్నా రైతుల హక్కులు రక్షించకపోతే, ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని స్పష్టం చేశారు. ఆయన మరియు స్థానిక ప్రజా ప్రతినిధులు సర్వేనెంబర్ 261లోని వ్యవసాయ భూములను పరిశీలించి రైతుల సమస్యలను పరిశీలించారు.



## భానూర్ కొండపోచమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు, మార్చి 11 (సందేశం టైమ్స్ సంగారెడ్డి టౌన్ ప్రతినిధి బి సంగమేశ్వర్): పటాన్‌చెరు మండలం భానూర్ గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ కొండపోచమ్మ దేవాలయంలో మంగళవారం నిర్వహించిన జాతర మహోత్సవంలో పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, గ్రామ ప్రముఖులు, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట: ముఖ్య ప్రభుత్వ కార్యక్రమాలు మరియు మహిళా సాధికారతపై కార్యాచరణ

సూర్యాపేట, మార్చి 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి) – జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పర్యవేక్షణలో సూర్యాపేటలో అనేక ప్రగతి కార్యక్రమాలు, శిక్షణా, సామాజిక కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. హుజుర్నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాలలో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల రెండవ వారంలో ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. కాలనీ అంతర్గత రోడ్లు, బ్లాకులు, సభాస్థలి, పార్కింగ్, మొక్కలు నాటడం తదితర పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఉండాలని, అత్యంత అర్హులైనవారికి ప్రాధాన్యం ఇవ్వాలని కూడా స్పష్టం చేశారు.

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా కోదాడ మున్సిపాలిటీ పరిధిలో 21 వార్డుల్లో నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమాన్ని కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించారు. ప్రతి ఇంటి చెత్తను వేరు చేసి మున్సిపల్ కార్మికులకు అందించడం, కాలనీలలో డ్రైనేజీ శుభ్రపరచడం, రోడ్లను పరిశుభ్రంగా ఉంచడం వంటి పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. విద్యా రంగంలో కూడా జిల్లా పరిషత్ గర్ల్స్ హై స్కూల్, సాయి భవాని మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాల సందర్శించి విద్యార్థులకి ప్రేరణ కల్పించి, కిచెన్ షెడ్స్, టాయిలెట్స్, కంప్యూటర్ రూమ్ వంటి సౌకర్యాలను పరిశీలించారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి అని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మహిళల విద్య, ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, స్వయం సహాయక సంఘాలు, యువత మరియు మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కే నరసింహ, అదనపు కలెక్టర్ సీతారామారావు, మున్సిపల్ చైర్మన్, డిప్యూటీ చైర్ పర్సన్, విద్యా, ఆరోగ్య, సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అదేవిధంగా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో జిల్లా కలెక్టర్లకు శిక్షణ విజయవంతం చేయాలని సూచించారు. ప్రతి గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రజాప్రతినిధులు సంక్షేమ పథకాలు, అర్హులైన ప్రజలకు అందించవలసిన విధులను తెలుసుకోవాలని స్పష్టం చేశారు.

## బీజేపీ పోరాటంతోనే వెలుగుమట్ల భూదాన్ బాధితులకు ఇళ్ల పట్టాలు

ఖమ్మం, మార్చి 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి) – ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఇళ్లు కోల్పోయిన బాధితులకు భారతీయ జనతా పార్టీ అండగా నిలిచింది. సుమారు 15 రోజుల క్రితం ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా భారీ పోలీసు బలగాల మధ్య ఇళ్లను కూల్చివేయడం జరిగింది. బాధితులను కలిసిన వెంటనే బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు సంఘటన స్థలానికి చేరుకుని మద్దతుగా నిలిచారు.ఈ విషయం రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు, ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకువచ్చి, ఖమ్మం వచ్చే విధంగా బాధితులకు భరోసా కల్పించారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిషన్లకు ఫిర్యాదు చేయించి న్యాయం కోరారు. అనంతరం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు.బీజేపీ నాయకులు పలు సార్లు రోడ్డెక్కి ఆందోళనలు నిర్వహించగా, ప్రభుత్వంపై నిరంతర ఒత్తిడి చూపిన ఫలితంగా వెలుగుమట్ల భూదాన్ బాధితులకు అక్కడే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు మాట్లాడుతూ, 62 ఎకరాల భూదాన్ భూమిలో ఆక్రమణకు గురైన 30 ఎకరాలను కూడా వెలికితీసి మా పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / యజమాని / సంపాదకురాలు: కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.